ప్రజాశక్తి
సోమవారం 23 జనవరి 2023
5
పార్వతీపురం మన్యం

నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

మండలంలోని అంపిలి ప్రాంతంలో గల నగర పంచాయతీకి సంబంధించి హెడ్ వాటర్ వర్క్స్ 15 హెచ్‌పి మోటార్ పంపింగ్ లైన్ మరమ్మతుకు గురైంది. ఈ నేపథ్యంలో నగరపంచాయితీ వద్ద గల వాటర్ ట్యాంకుల (ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్) పరిధిలో ఉన్న 3,4,5,6,7,8 వార్డులకు సోమవారం మంచి నీటి కుళాయిల ద్వారా నీటి సరఫరా కాదని కమిషనర్ సర్వేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎఇ నేతృత్వంలో ఇంజనీరింగ్ సిబ్బంది రిపేరింగ్ పనులు చేస్తున్నారన్నారు. మరమ్మతుల అనంతరం నీటిసరఫరా చేయనున్నామని, కావున పట్టణ వాసులు ఇందుకు సహకరించాలని ఆయన కోరారు.

నేటి నుంచి శంబర జాతర

- నేడు తొలేళ్లు... రేపు సిరిమానోత్సవం
- 200 ఆర్‌టిసి బస్సులు
- 700 మంది పోలీసు బందోబస్తు
- దేవాదాయ శాఖ పటిష్ట ఏర్పాట్లు

ఘటాలను తిప్పుతున్న మహిళలు

ఇదీ చరిత్ర

భక్తుల మదిలో కొలువైన పోలమాంబ అమ్మవారు ఓ నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించారని ఇతిహాసాలు చెబుతున్నాయి. శంబరలోని జన్ని పేకాపు వంశంలో జన్మించారు. అందరి మహిళల్లా కాకుండా పోలమాంబ నడవడిక విభిన్నంగా ఉండేదంట. మహిమాన్విత రూపు దారినిగా పోలమాంబ ఉండేదని, యుక్త వయసు వచ్చేసరికి మోకాసు మామిడిపల్లికి చెందిన వ్యక్తితో పెండ్లి చేసేందుకు తల్లిదండ్రులు నిర్ణయించారు. పెళ్లి పల్లకిలో మేనత్త పెదపోలమాంబతో కలిసి మామిడిపల్లి చేరుకునే మార్గమధ్యలో పల్లకిని అక్కడ ఆపి కొంత దూరం నడిచి వెళ్లి అంతర్ధానమైనట్లు అమ్మవారి కథ చెబుతుంది. పోలమాంబ మేనత్త ఈ విషయాన్ని బోయల ద్వారా పోలమాంబ తల్లిదండ్రులకు చేరవేసింది. అనంతరం ఆమె కూడా అంతర్ధానమైనట్లు కథలు చెబుతున్నాయి. అప్పటి నుంచి గ్రామదేవతగా ప్రారంభమైన పోలమాంబ జాతర ఆంధ్ర రాష్ట్రంలో నలుమూలలతో పాటు పక్క రాష్ట్రాల్లో కూడా ప్రాచుర్యం పొందింది.

ప్రజాశక్తి - మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవతగా, భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా పేరుగాయించిన శంబర పోలమాంబ అమ్మవారి జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ జాతరలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అంపక ఉత్సవం జరగనుంది. ఈ సందర్భంగా దేవాదాయశాఖ ఇఒ రాధాకృష్ణ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ దాలినాయుడు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు. గ్రామంలోని చదురుగుడి, వనం గుడి వద్ద కూడా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటైన తర్వాత మొట్టమొదటి గిరిజన జాతర కావడంతో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తమ శాఖ అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ జాతర విజయవంతమయ్యాలా పటిష్ట చర్యలు చేపట్టారు. రెవెన్యూ శాఖ తరపున ఆర్‌డిఒ కె.హేమలత, పోలీసు శాఖ తరపున డిఎస్‌పి సుభాష్ జాతరకు సంబంధించిన అన్ని విషయాలపై ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ఈ ఏడాది పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేపట్టారు.

200 ఆర్‌టిసి బస్సులు

జాతర సందర్భంగా 700 మందితో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా క్యూలైన్లో సిసి కెమెరాలతో పాటు గ్రామంలోనూ సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. సిరిమాను సందర్భంగా డ్రోన్ కెమెరాలను కూడా వినియోగించనున్నారు. ఆర్‌టిసి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 200 ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడపనుంది. రద్దీని బట్టి అవసరమైతే మరిన్ని సర్వీసులు పెంచనుంది.

14వేల లడ్డూ ప్రసాదాలు సిద్ధం

అమ్మ వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల కోసం లడ్డూ, పులిహోరా ప్రసాదాలను సిద్ధం చేసినట్లుఇఒ రాధాకృష్ణ తెలిపారు. ఇందుకోసం 14వేల లడ్డు ప్రసాదాలను, పులిహోర ప్యాకెట్లను సిద్ధం చేశామన్నారు. లడ్డు ధర రూ.15, పులిహోరా ధర పది రూపాయలుగా నిర్ణయించి ఆన్లైన్ టికెట్లు విధానం చేపట్టామన్నారు. నేరుగానే క్యూలైన్ల వద్ద ఆన్లైన్లో టికెట్లు విక్రయించే ఏర్పాట్లు చేస్తామన్నారు. 10, 50 రూపాయలు టికెట్లతో పాటు ఉచిత దర్శనం కూడా ఏర్పాటు చేశామన్నారు. వృద్ధులు, వికలాంగుల కోసం నేరుగా పోలీసు వారు అమ్మవారి దర్శనం కోసం ప్రత్యేక వాహనాలు కూడా ఏర్పాటు చేశారని అన్నారు.

వేలంపాట, బైండోవర్లపై సిఐ సమీక్ష

జాతర సందర్భంగా సిరిమాను తిప్పేందుకు వేలంపాట నిర్వహించి విధానంపై భిన్న స్వరాలు వెలుడడంపై ఆదివారం సాలూరు సిఐ ధనుంజయరావు క్యూలైన్లో వద్ద గ్రామస్తులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది కొత్త నిర్ణయాలు అన్న శీర్షికతో 'ప్రజాశక్తి'లో వార్త వెలువడిన విషయం విధితమే. సిరిమాను తిప్పేందుకు వేలం నిర్వహించడంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ దాలినాయుడు ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని స్థానిక ఎంపిటిసి సభ్యులు టి.పోలినాయుడు ఆధ్వర్యంలోని కొంతమంది గ్రామస్తులు ఆక్షేపణ తెలిపారు. దీనిపై సిఐ ధనుంజయరావు ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ తీసుకున్న నిర్ణయం సరిగ్గా లేదని అభిప్రాయానికి వచ్చారు. పోలమాంబ అమ్మవారితో శంబర వెలుగులోకి వచ్చిందని, జాతరలో ఏ విధమైన పొరపాట్లు లేకుండా అంతా సహకరించాలని ఆయన అన్నారు. సిరిమాను తిప్పేందుకు 40మందిని మాత్రమే అనుమతిస్తామని, దీనికి సంబంధించి వెంటనే జాబితా సిద్ధం చేయాలని చైర్మన్‌కు సూచించారు. సిరిమాను సందర్భంగా ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు జరిగితే సంబంధిత వేలం పాటదారునిపై కఠిన చర్యలు చేపడతామని సిఐ హెచ్చరించారు.

ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న డిసి సుజాత

జాతర ఏర్పాట్లు పరిశీలించిన డిసి

జాతర ఏర్పాట్లను మన్యం జిల్లా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత ఆదివారం శంబర గ్రామాన్ని సందర్శించి పరిశీలించారు. లడ్డూ ప్రసాదాలను, క్యూలైన్లను, టికెట్లు పంపిణీ విధానాలను ఇఒ రాధాకృష్ణను అడిగి ఆమె తెలుసుకున్నారు. అలాగే ఆన్లైన్ టికెట్ విధానాన్ని కూడా ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ కెఎల్ శోభారాణి పాల్గొన్నారు.

ఏర్పాట్లపై ఆరా తీస్తున్న ఎస్‌పి

ప్రశాంతంగా కానిస్టేబుల్ రాత పరీక్ష

పరీక్షా కేంద్రాలను పోలీసు ఉన్నతాధికారుల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్, సీతానగరం

జిల్లాలో కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఆదివారం జరిగిన ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు ఎస్‌పి వి.విద్యాసాగర్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురంలో 17, సీతానగరంలో2 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు 13,644 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 13,390 మంది హాజరయ్యారు. 254మంది అభ్యర్థులు గైర్హాజయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిష్పాక్షికంగా జరిగేందుకు విస్తృతంగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించేందుకు ఎస్పీ, అడిషనల్ ఎస్పీలు పార్వతీపురం, సీతానగరంలోని పలు పరీక్షా కేంద్రాలను స్వయంగా పరిశీలించగా, డిఎస్పీలు4, సిఐలు 9, ఎస్ఐలు 25, కానిస్టేబుల్స్300 మొత్తం 336 మందిని బందోబస్తుకు వినియోగించినట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తుల మధ్య ప్రశాంతంగా నిర్వహించారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎఎస్‌పి

సీతానగరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగిన కానిస్టేబుల్ పరీక్షా కేంద్రాలను ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఎడిషనల్ ఎస్పీ ఒ.దిలీప్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలు, వసతులు గురించి తెలుసుకున్నారు. అలాగే డైట్ కళాశాలలో గల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. వీరి వెంట సిఐ శ్రీనివాసరావు ఉన్నారు.

పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థుల క్యూ

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు

సిపిఎస్ రద్దు కోసం పోరు : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు రావాల్సిన డిఎ బకాయిలు, ఇతర బకాయిలు చెల్లించాలని, సిపిఎస్ రద్దు కోరుతూ పెద్దఎత్తున ఉద్యమం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం బెలగాంలోని హిందీ కళాశాలలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ అధ్యక్షతన యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మురళీమోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావాల్సిన డిఎ, ఇతర బకాయిలు చెల్లించాలని, తమకు బకాలు చెల్లించకుండా ఆ నిధులను ఇతర పథకాల కోసం వినియోగిస్తున్నారని, ఇలా చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అలాగే సిపిఎస్ రద్దు చేస్తానని పాదయాత్రలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చకుండా ఉద్యమాలను అణిచివేయడం దారుణమన్నారు. అసంబద్ధమైన విద్యావిధానాల వల్ల విద్యావ్యవస్థ చిన్నా భిన్నమవుతుందని, ఉపాధ్యాయులను తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తున్నాయని అన్నారు. వీటన్నింటిపై త్వరలో ఉద్యమకార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.భాస్కరరావు, సహాధ్యక్షులు విజయ్‌కుమార్, వి.జ్యోతి, ట్రెజరర్ మురళి, జిల్లా కార్యదర్శులు ఎన్.శ్రీనివాసరావు, భాస్కరరావు, ఎ.కృపానందం, గంగమ్మ ,మండల నాయకులు పాల్గొన్నారు.

యువతకు నైపుణ్య శిక్షణ

- మన్యం జిల్లా ఐటిఐల్లో ఏర్పాట్లు
- శిక్షణ పొందిన వారికి కేంద్ర ప్రభుత్వ ధ్రువపత్రాలు

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లాలోని నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు ఐటిఐల్లో ఐదు రోజుల పాటు శిక్షణ నిర్వహించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాపీపని, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, పంప్ ఆపరేటర్, ఫిట్టర్ వంటి కోర్సుల్లో యువతకు ఉపాధి శిక్షణ లిచ్చి ధ్రువపత్రాలు జారీ చేయనున్నారు. సాలూరు, భద్రగిరి, సీతంపేట ప్రభుత్వ ఐటిఐల్లో, పార్వతీపురంలో గల జ్యోతి, భ్రమరాంబ ప్రయివేటు ఐటిఐల్లో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఒక్కో బ్రాంచిలో 20నుంచి 40మంది వరకు యువకులకు ఉపాధి శిక్షణ నిర్వహించనున్నారు. ఎంపిక చేసిన 433మంది యువతీ యువకులకు ఉపాధి శిక్షణ అందించనున్నారు. ఐదు రోజుల శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ధ్రువపత్రాలను అందజేస్తారు. ఈ ధ్రువపత్రాలు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకోవడానికి ఉపయోగపడతాయి. శిక్షణ సమయంలో మధ్యాహ్నం పూట యువతకు భోజనం పంపిణీ చేయనున్నారు. నిర్దేశించిన ఐటిఐల పరిధిలో ఉన్న మండలాలకు చెందిన యువతీ యువకులను శిక్షణ కోసం సంబంధిత నోడల్ అధికారులు ఎంపిక చేస్తారు.

సొంత భవనం లేక చేజారిన నైపుణ్య శిక్షణ కేంద్రం

పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐకి సొంత భవనం లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరు కావాల్సిన అనేక శిక్షణ కార్యక్రమాలు, ప్రాజెక్టులను కోల్పోవాల్సి వస్తోంది. ప్రభుత్వ ఐటిఐ ప్రారంభం నుంచి ఇంతవరకు అద్దె భవనంలోనే కొనసాగుతోంది. విద్యార్థులకు తరగతులు ఇరుకు గదుల్లో నిర్వహించాల్సి వస్తోంది. తరగతి గదులు ఒకచోట, ప్రిన్సిపల్ కార్యాలయం మరోచోట నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ ఐటిఐకి మంజూరైన నైపుణ్యాభివృద్ధి కేంద్రం చేజార్చుకునే పరిస్థితి దాపురించింది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశాలమైన భవనాల్లో వుండడం తో నైపుణ్యాభివృద్ధి కేంద్రం అక్కడకి కేటాయించారు. సొంత భవనాలున్న ప్రభుత్వ ఐటిఐల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. గడచిన దశాబ్ద కాలంగా స్థానిక ప్రభుత్వ ఐటిఐకి సొంత భవనం నిర్మాణానికి భూమిని కేటాయించడంలో రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారు. రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రభుత్వ ఐటిఐ అధికారులు తిరుగుతున్నా తీవ్ర జాప్యం జరుగుతోంది. ఐటిఐకి భూమి కేటాయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆనంద్ మండల రెవెన్యూ అధికారులను ఆదేశించినా ఫలితం కనిపించడం లేదు. సొంత భవనం లేకపోవడంతో ఈ ప్రాంతానికి చెందిన గిరిజన, బిసి యువకులు అనేక ఉపాధి శిక్షణ కార్యక్రమాలు పొందలేకపోతున్నారు.

నైపుణ్య శిక్షణకు ఎంపికలు : వి.రవికుమార్, ప్రిన్సిపల్ ప్రభుత్వ ఐటిఐ

మన్యం జిల్లా పరిధిలో ఉన్న నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం త్వరలో ప్రారంభం కానుంది. మన్యం జిల్లాలో మూడు ప్రభుత్వ ఐటిఐలు, రెండు ప్రయివేటు ఐటిఐల్లో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తాపీపని, ప్లంబింగ్ ఎలక్ట్రీషియన్, పంప్ ఆపరేటర్, ఫిట్టర్ ట్రేడుల్లో ఐదు రోజుల పాటు శిక్షణ పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ధ్రువపత్రాలను అందజేస్తాం. ప్రభుత్వ ఐటిఐకి సొంత భవనం లేక పోవడంతో నైపుణ్యాభివృద్ధి కేంద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కి తరలించాల్సి వచ్చింది.

ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దుతా

వాహనదారులంతా లైసెన్స్‌లు తప్పనిసరిగా ఉండాలి

ప్రజాశక్తితో జిల్లా రవాణా శాఖ అధికారి సి.మల్లికార్జున రెడ్డి ముఖాముఖి



పార్వతీపురం మన్యం జిల్లాను ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని జిల్లా రవాణాశాఖాధికారి సి.మల్లికార్జునరావు తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లాలో అత్యంత ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి పంపామని చెప్పారు. అలాగే ప్రతి వాహనాదారుడు తన వాహానానికి సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ భాగంగా రోడ్డు భద్రతా వారోత్సవాలను కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా వాహనచోదకులకు వైద్యపరీక్షలు, భద్రత నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వీటిని పాటు జిల్లాలో ప్రమాదాల నివారణకు, వాహనాదారుల లైసెన్స్‌లు తదితర అంశాలను ప్రజాశక్తి ముఖాముఖికి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే....

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రవాణా శాఖ పరంగా జిల్లాకు గుర్తింపుగా చేసే మీ కృషి?

పార్వతీపురం మన్యం జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్ది ఉత్తమ రవాణా శాఖగా గుర్తింపునకు కృషి చేస్తాను. జిల్లాలో సాలూరు మండలం అంటివలస విలేజ్ బస్ స్టాప్, పాచిపెంట మండలం కొండవలస దుర్గగుడి జంక్షన్, కంకణాపల్లి బస్ స్టాప్ స్థలాలను, పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి, ఫ్లైఓవర్ బ్రిడ్జి జిల్లాలో ఆరుచోట్ల అత్యంత ప్రమాదకరంగా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపాం.

జిల్లాలో గుర్తించిన వాహనాలు ఎన్ని ఉన్నాయి?

జిల్లాలో 24 వేల వాహనాలు ఉన్నాయి. వీటిలో 11వేలు ద్విచక్ర వాహనాలు ఉండగా, 7వేల కార్లు, లారీలు, ట్రిప్లర్లు, ఇతర వాహనాలు 4652, ఆటోలు-1348 ప్రభుత్వ అనుమతులు కలిగి ఉన్నాయి.

డ్రైవింగ్ లైసెన్స్ గల అర్హతలు ఏమిటి?

డ్రైవింగ్ లైసెన్స్ పొందగోరు ప్రతి ఒక్కరికి 18 ఏళ్ళ నిండి నివాస, జనన, గుర్తింపు పత్రాలతో తమ కార్యాలయానికి అర్జీ పెట్టుకున్న వారికి డ్రైవింగ్ తనిఖీలు చేసి లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ అనుమతులను జారీ చేస్తాం.

వాహనాల డ్రైవర్లకు మీ శాఖ ద్వారా ఎటువంటి అవగాహన కల్పిస్తున్నారు?

ప్రతి ఏటా రోడ్డు రవాణా భద్రత వారోత్సవాలు జరిపే క్రమంలోనే ఈనెల 18 నుండి 24 వరకు రోడ్డు రవాణా భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో ప్రారంభమైన భద్రత వారోత్సవాలు వారంలో రోజుకొక కార్యక్రమం జరుపుతున్నాం. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం జరిగే ప్రమాదాన్ని, హెల్మెట్ ప్రాధాన్యత, అతివేగం వల్ల కలిగే అనర్థాలు, కారు డ్రైవర్ సీట్ బెల్ట్ ధరించడం, ట్రాఫిక్ నియమ, నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం. వీటితో పాటు డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి డ్రైవింగ్ శక్తి సామర్థ్యాలను వివరిస్తున్నాం.

కాల పరిమితం దాటిన వాహనాల నెంబర్ ప్లేట్లు లేకుండా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని ఎలా నిరోధిస్తారు?

రోడ్డు భద్రత వారోత్సవాలు అనంతరం కాలం చెల్లిన వెహికల్ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఉన్న వారిపై నిఘా పెడతాం. ద్విచక్రవాహనాలపై ముగ్గురు ప్రయాణం ప్రమాదం పై అవగాహన కల్పిస్తాం.

ఈ ఏడాది ఆర్థిక లక్ష్యాలు ఎంతవరకు సాధించారు?

కొత్తగా ఏర్పడిన జిల్లా పరిధి తగ్గడంతో జిల్లా లక్ష్యం 40శాతం మాత్రమే సాధించగలిగాం. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.74 కోట్లు లక్ష్యంగా కాగా, రూ.21.79 కోట్లు సాధించాం. భవిష్యత్తు ఆర్థిక సంవత్సరంలో మా లక్ష్యం పురోగతికి మంచి కృషి చేస్తాం.

కీచక హెచ్‌ఎం సస్పెన్షన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సంతకవిటి మండలం అప్పలఅగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎర్రా అప్పలరాజును విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపుల అభియోగాలపై ఆయన్ను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థినులను లైంగిక పరంగా వేధిస్తే విధుల నుంచి తొలగించడమే కాకుండా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికైంది. ఎపిఎన్‌జిఒ జిల్లా జెఎసి చైర్మన్ జె.మురళి, నాయకులు వై.ఆనంద్ కుమార్, ఎన్.నీలాద్రినాయుడు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ రవి యాదవ్, ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, కోశాధికారి బి కాశయ్య సమక్షంలో ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షులుగా మువ్వల గంగాప్రసాద్, ప్రధానకార్యదర్శిగా చంద్రశేఖర రాజుతోపాటు మరో ఏడుగురు సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో విజయనగరం పట్టణ కార్యదర్శి గంగి రమేష్, కోశాధికారి జి.అప్పారావు, సహాయ కార్యదర్శి ఎం.మంగరాజు, పి.మురళీ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న సిపిఎం నాయకులు

మోటార్లకు స్మార్ట్ మీటర్లు వద్దు

ప్రజాశక్తి - పాచిపెంట

పెంచిన విద్యుత్‌ఛార్జీలు తగ్గించాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ ఏర్పాటు యోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని సిపిఎం నాయకులు కె.ఈశ్వరరావు, ఎస్.అప్పలస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని మెట్టవలస, కొత్తవలస, శిల గుమ్మ కోట గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెంచిన విద్యుత్‌శాఖ తగ్గించాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ఆలోచన విరమించుకోవాలని, ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలను బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే వ్యతిరేకిస్తుంటే మన రాష్ట్రంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయడానికి పూనుకున్నారని అన్నారు. దీనివల్ల వినియోగదారులపై రూ.6వేల కోట్లు భారం పడుతుందని తెలిపారు కమిషన్ అనుమతి లేకుండా ఏకపక్షంగా మీటర్లను కొనుగోలు చేశారని అన్నారు. హరిత ఎమర్జెన్సీ పేరుతో 75 వేల ఎకరాలు అదానికి కట్టబట్టేందుకు ప్రభుత్వం పూనుకుంటుందని తెలిపారు. 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కావున ఈ సమస్యల పైన ప్రజలకు అవగాహన కలిగించేందుకు గ్రామాల్లో తిరిగి ప్రచారం చేస్తున్నామని, రానున్న కాలంలో ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు కళ్యాణ్, సుబ్బారావు, జానకీరాం తదితరులు పాల్గొన్నారు

ఉత్తరాంధ్ర కవులను సన్మానిస్తున్న సాహితీ సాంస్కృతిక సభ్యులు

ఉత్తరాంధ్ర పిలుపు.. ప్రపంచానికే మేలుకొలుపు

గుమ్మలక్ష్మీపురం : ఉత్తరాంధ్ర ప్రాచీన, వర్తమాన కవుల గురించి రాసిన ఉత్తరాంధ్ర పిలుపు-ప్రపంచానికే మేలుకొలుపు కవితా కావ్యం పలాస-కాశీబుగ్గలో జరుగుతున్న ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదికలో హైదరాబాద్ సినీ గేయరచయిత డాక్టర్ అందెశ్రీ చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు గుమ్మలక్ష్మీపురం ప్రాంత సాహితీ చైతన్య కిరణాలు అధ్యక్షులు, డాక్టర్ బోగల ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ కవితా కావ్యానికి బాల కథా నిలయం ఉపాధ్యక్షులు (గుమ్మలక్ష్మీపురం) పాలక దేవానంద్ పాటల బాణి కట్టి పాడారు. ఈ ఆవిష్కరణలో కేంద్రసాహితీ అకాడమీ పురస్కార గ్రహీత అట్టాడ అప్పలనాయుడు, పిల్లా తిరుపతిరావు, తర్ర పాటి రాజేశ్వరి, తెప్పల కృష్ణమూర్తి, ఉండ రుద్రమూర్తి, కుమార్ నాయక్, సిరికి స్వామి నాయుడు, పివి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావును, దుర్గాప్రసాదను, చాడ శ్రీనివాసను, పాలక దేవానందను ఘనంగా సన్మానించారు.

కార్పొరేషన్ల పదవీ కాలం పెంపుపై హర్షం

సీతానగరం: రాష్ట్రంలో వివిధ బిసి కార్పొరేషన్ల చైర్మన్, డైరెక్టర్ల పదవీ కాలాన్ని పెంచుతూ జీవో తీసుకువచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఎస్సీ కమిషనర్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.జయమణి హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల ఈ పదవీ కాలాన్ని ఉపయోగించుకొని బిసి అభ్యున్నతికి, పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఏగోటివలసలో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఏగోటివలసలో గడపగడపకు...

సీతానగరం : మండలంలోని లక్ష్మీపురం సచివాలయ పరిధిలోని ఏగోటివలసలో ఆదివారం గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందిస్తుందన్నారు ఈ కార్యక్రమంలో వచ్చే సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పురిటి రాధాకృష్ణ, ఎంపిటిసి సభ్యులు టి.సత్యవతి, ఎంపిపి బి.రమణమ్మ, శ్రీరామనాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు మామిడి బాబ్జీ, వైసిపి నాయకులు బి.చిట్టిరాజు, డి.నాగరత్నం, సర్పంచులు బి.తిరుపతిరావు, అప్పారావు, మండల నాయకులు ఈశ్వరనారాయణ, సత్యనారాయణ, కె.రత్నాకర్, గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

చదవడం-మాకిష్టమైన కార్యక్రమంలో పాల్గొన్న పాఠకులు

విజ్ఞానం పెంచుకోవాలి

పాలకొండ : గ్రంథాలయం ద్వారా లభించే పుస్తకాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలని ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బూరు గణేష్‌బాబు అన్నారు. పాలకొండ శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో లభించే విలువైన పుస్తకాన్ని చదివి భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్స్ రీడర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జయప్రకాష్‌నారాయణ, నరహరి శాస్త్రి

మాఘహేలా, శ్రీ సూర్య వైభవాల కరపత్రం ఆవిష్కరణ

పార్వతీపురంటౌన్ : పట్టణ శివారులో ఉన్న శ్రీ సూర్య పీఠంలో ఈ నెల జనవరి 26,27, 28 తేదీల్లో జరిగే మాఘహెలా, శ్రీ సూర్య వైభవాలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయ ప్రకాష్ నారాయణ, సూర్య పీఠం నిర్వాహకులు వేమకోటి నరహరి శాస్త్రి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరహరి శాస్త్రి మాట్లాడుతూ ఈనెల 26న గురువారం ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, ప్రాతకాలార్చన, విగ్నేశ్వరపూజతో ప్రారంభమై మాఘహేలా, శ్రీ సూర్య వైభవ వార్షికోత్సవ సంకల్పం, 27న శుక్రవారం సహస్ర కలశాభిషేకం, 28న శనివారం రథసప్తమి సందర్భంగా శ్రీ సూర్య భగవానుని కల్యాణోత్సవం, సహస్ర దీపాలంకరణ ఊంజల్, పూలంగి సేవలు జరుగుతాయని తెలిపారు. పై కార్యక్రమంలో పాల్గొనే భక్తులు ముందుగా సూర్య పీఠం ప్రాంగణంలో ఉన్న కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకుని స్వామివారిని దర్శించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దేవకోటి వెంకట నాయుడు, పొట్నూరు వెంకటనాయుడు, నంగిరెడ్డి మధుసూదన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

యువగళాన్ని విజయవంతం చేయాలి

సీతంపేట : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ తలపెట్టిన యువగళాన్ని విజవంతం చేయాలని కోరుతూ ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు పడాల భూదేవి కన్నెధార కొండల్లో వెలసిన ముక్కిడి పోలమ్మను వేడుకున్నారు. ఆమె తోపాటు పాలకొండ పట్టణ మహిళా నాయకులు లక్ష్మీ, దుర్గమ్మ, చిలకమ్మ కూడా ముక్కిడిపోలమ్మను దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ లోకేష్ చేపడుతున్న యువగళం విజయవంతం కావాలని ప్రార్థించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా 2024లో టిడిపి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ధీమ వ్యక్తం చేశారు.

అమ్మవారిని దర్శించుకుంటున్న టిడిపి నాయకురాలు భూదేవి

ఏజెన్సీలో పర్యాటక శోభ

ప్రజాశక్తి - సీతంపేట

ఏజెన్సీలో పర్యాటకశోభ ప్రత్యేకతను సంతరించుకుంది. సీతంపేట అంటే ముందుగా గుర్తుకొచ్చేది ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ అని. ఈ పార్కులో ఉన్న సాహసోపేతమైన క్రీడలు, కన్నులను మైమరపించే అందాలు, తన ఒంపు సొంపులతో జాలువారే జలపాతాలు మరోపక్క యాత్రికులను కనువిందు చేస్తున్నాయి. విహారయాత్ర వాహనంలో ప్రయాణిస్తుంటే పచ్చని పొలాలు, సుందరమైన కొండలు, కనువిందు చేసే వ్యూ పాయింట్లు తన ఒంపు సొంపులతో మైమరపించే సోయగాలు దర్శనమిస్తాయి. అధికంగా కార్తీక మాసం నుంచి వేసవి కాలం వరకు పర్యాటకులతో ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ సందడిగా మారుతుంది. నిత్యం పర్యాటకులతో రద్దీగా ఉంటుంది.

సీతంపేటకు పోటెత్తుతున్న పర్యాటకులు

ఈ అడ్వెంచర్ పార్క్ చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు అందర్నీ కనువిందు చేస్తోంది. పర్యాటకంలో జిల్లా నలుమూల నుండే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచిగా పర్యాటకులు తరలివస్తున్నారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నీటి మీద నడక వెళ్తుంటే చుట్టూ నీటి మధ్యలో నడిచి వెళ్తున్నట్లుగా అనిపిస్తుంది. జల విహార వద్ద బోట్ షికారుతో పాటు కయాకింగ్ రెండింటిపై వెళ్తారు. స్కై సైకిల్ ఆకాశంలో ఒక తీగపై తొక్కుతుంటే మనకన్నా మేఘాలు శరవేగంతో ముందుకు వెళ్తుంటాయి.

రైడర్‌పై స్వారీ చేస్తున్న యువకుడు

లో సైకిల్‌పై విహరిస్తున్న యువతి

బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

చిన్నారులు కమెండో నెట్‌పై చిల్డ్రన్ పార్కులో ఆడుకుంటారు. ఆల్టన్ వెహికల్‌తో పార్క్ చుట్టూ చక్కర్లుకొడుతూ చుట్టుముడతారు. మరి కొంతమంది విలువిద్యలో పాల్గొంటూ గన్ షాట్ షూటింగ్ చేస్తారు. 5డి థియేటర్ ప్రాంగణంలోని ఎక్కడా లేని విధంగా ఈ థియేటర్ సీతంపేట అడ్వెంచర్ పార్కులో ఉంది. ఉన్న 15 నిమిషాలు పర్యాటకులు సినిమా చూస్తే ఆ శబ్దాలకు మన కళ్లెదుటే జరుగుతున్నట్లు అనిపిస్తుంది. యువతీ యువకులు ఆనంద విహార వద్ద సాయంత్రం కేరింతలు కొరుతూ, ఉత్సాహంగా ఉల్లాసంగా డాన్సులు వేసి ఎంజాయ్ చేస్తారు.

పర్యాటక వాహనంలో ప్రయాణించి మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి ముందుగా అక్కడ ఉన్న జలపాతం పగోడాలను కనువిందు చేసుకుంటారు. కొండపైకి ఎక్కి జలాలు ఎలా వస్తున్నాయి అని చూస్తారు. అనంతరం జలపాతంలో జలకాలు ఆడుతారు. అలాగే అడలి పొలాలు వ్యూ పాయింట్లు సందర్శిస్తారు. అక్కడి నుంచి చూస్తే చుట్టుపక్క మండలాలు తో పాటు ప్రకృతి అందాలు దర్శనమిస్తాయి. అలాగే అడ్వెంచర్ పార్క్ మూడు కిలోమీటర్ల దూరంలో ఎత్తయిన కొండపై ఉన్న జగతిమెట్ట రిసార్ట్ పనులు కొంతమేరకు జరిగాయి. దాన్ని కూడా సందర్శిస్తారు. ఇలా పర్యాటకులను ఎన్టీఆర్ ఎడ్వంచర్ పార్కు ఆకట్టుకుంటోంది.

తక్కువ నీటితో సజ్జసాగు

ప్రజాశక్తి -పాలకొండ రూరల్:

రాష్ట్రంలో వరి, మొక్కజొన్న తర్వాత సజ్జ ప్రధానమైన ఆహారపంట. ఈ పంట తక్కువ నీటితో తక్కువ పెట్టుబడితో తక్కువ సారవంతమైన ఎర్ర నేలలో గరపనేలల్లో కూడా పండించవచ్చిన అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు తెలిపారు. దేశంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు సరిపడే నాణ్యమైన పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించడం మన ముందున్న సవాలని, చిరుధాన్యాలైన జొన్న, సజ్జ, రాగి ఇతర తృణధాన్యాలను వరి, గోధుమల కన్నా ఎక్కువ పోషకాలు విలువలు కలిగి ఆరోగ్యరీత్యా చాలా

శ్రేష్టమైనవిగా గుర్తించాలన్నారు. తొలకరి వర్షాలు పడిన వెంటనే ఖరీఫ్ జూన్ మొదటి వారం నుంచి జూలై నెల రెండో వారం లోపు విత్తుకోవాలని, పంట కాలంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, నీరు నిల్వ ఉంటే మొక్కలు సరిగా ఎదగవు. హెచ్‌హెచ్‌బి-67 సజ్జరకం ఖరీఫ్, రబీలో వేసుకోవచ్చు. పంటకాలం 68-70 రోజులు అతి తక్కువ కాలంలో కోతకు శంకర రకం విత్తనం ఎకరాకు 1.6 కిలోలు సరిపోతుందని అన్నారు. విత్తన శుద్ధి 20 గ్రాములు ఉప్పునీటి ద్రావణంలో విత్తనాలను పది నిమిషాలు ఉంచడం ద్వారా శిలేంద్ర అవశేషాలు తేలేటట్లు చేసి తొలగిం చవచ్చునని, చిరుధాన్యాల పంటలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన స్కీం కింద "పోషకాహార భద్రత"కొరకు విస్తృత స్థాయిలో చిరుధాన్యాల సాగు పెంపుదల పథకం ప్రవేశపెట్టి చిరుధాన్యాల సాగు, విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకతలతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులను తిను బండారాలను తయారుచేసి ప్రజలందరికి మంచి పోషకాహారాన్ని అందించడం కోసం ప్రభుత్వాలు చాలా ప్రోత్సాహకాలను అందిస్తుందని అన్నారు. రైతాంగం చిరుధాన్యాలలో గల పోషక విలువలో గుర్తించి వాటిని ఆహారంలో విధిగా చేర్చాలని ప్రసాదరావు రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.

పాదయాత్రను అడ్డుకోవడం ప్రజాస్వామ్య పరిహాసమే

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తిచూపే గొంతులు నొక్కే ప్రయత్నం జరుగుతుందని, చీకటి జీవోలతో పాదయాత్రలను అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేయడమేనని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. అదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుతో కలిసి నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహించే పాదయాత్రను అడ్డుకోవాలని చూస్తే టిడిపి శ్రేణులతో పాటు ప్రజలూ తిరగబడతారని అన్నారు. గతంలో వైఎస్ జగన్ పాదయాత్రకు బేషరుతుగా అనుమతులిచ్చి చంద్రబాబు తన గొప్పతనాన్ని చాటుకున్నారని, ఈ ప్రభుత్వంలో పాదయాత్రకు అనుమతులు అడిగితే పాల్గొనే వారి జాబితాలు ఇమ్మని నిబంధనలు పెట్టడం హాస్యాస్పదమని అన్నారు. పాదయాత్రలో పాల్గొనే వారి సంఖ్య ఎవరికైనా ముందుగా తెలుస్తుందా అని ప్రశ్నించారు. లేనిపోని

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు జగదీష్

సాకులు చూపి ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పాదయాత్రను అడ్డుకోవాలని చూస్తే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఇంకా చచ్చిపోలేదని, ప్రజలే తిరగబడి దాన్ని పరిరక్షించుకుంటారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.వెంకటనాయుడు, ఉదయభాను, కోలా వెంకటరావు, రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన నిమ్మ

ఒక్కసారిగా పెరిగిన ధరలు

ప్రజాశక్తి - కురుపాం

సాధారణంగా నిమ్మకాయల ధర వేసవిలో ఎక్కువగా, చలికాలంలో తక్కువగా ఉంటుంది. అయితే ఈ ఏడాది చలికాలంలోనూ వీటి ధర చుక్కలనంటుతోంది. బస్తా నిమ్మకాయల ధర రూ.వెయ్యి నుంచి రూ. 2 వేలకు ఒక్కసారిగా పెరిగింది. దీంతో ఇటు వ్యాపారులు.. ఆటు కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. మండలానికి ఏజెన్సీ గిరిజన గ్రామాల నుంచి నిమ్మకాయలు దిగుమతి అవుతాయి. నిమ్మకాయలు దిగుమతి ధర రెట్టింపు కావడంతో రిటైల్ వ్యాపారులూ ధర పెంచారు. ఇప్పటి వరకూ రూ.10 కి 10 కాయలు అమ్మేవారు. రూ.10కి ఇప్పుడు నాలుగే ఇస్తున్నారు. కేజీ అయితే రూ.100 అవీ సైజు బాగా తగ్గిపోయాయిని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట తగ్గడం వల్ల సరుకు ధర పెంచేశారని వ్యాపారులు అంటున్నారు. చలికాలంలోనూ ఇంత ధర ఏమిటని కొనుగోలుదారులు మండి పడుతున్నారు. నిత్యావసరాల ధరలతో పాటు నిమ్మకాయలు కూడా ప్రియం కావడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు జివి రమణ, సన్యాసిరావు

ప్రత్యామ్నాయ బస్‌షెల్టర్ నిర్మించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తొలగించిన బస్సు షెల్టర్ స్థానంలో ప్రత్యామ్నాయ బస్ షెల్టర్‌ను నిర్మించాలని పట్టణ పట్టణ పౌర సంక్షేమ సంఘం, సిపిఎం పట్టణ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా బెలగాం ప్రాంత ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా చర్చి వీధి సమీపంలో ఉన్న బస్ షెల్టర్‌ను ఇటీవల జిల్లా అధికార యంత్రాంగం కూల్చివేసిందన్నారు. దీనివల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పార్వతీపురం పట్టణ ప్రాంతంతో పాటు, పరిసర గ్రామాల ప్రయాణికులు ప్రతిరోజు జిల్లా కలెక్టరేట్‌కు వచ్చే నాలుగు నియోజకవర్గ ప్రయాణికులు, సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ పరిస్థితుల్లో తొలగించిన బస్సు షెల్టర్ స్థానంలో ప్రత్యామ్నాయ బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలనే ఆలోచన అధికారులకు లేకపోవడం విచారకరమని అన్నారు. కూల్చివేసిన బస్సు షెల్టర్‌కు ప్రత్యామ్నాయంగా చర్చి జంక్షన్‌లో బస్సు షెల్టర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిచో బస్సు షెల్టర్ నిర్మాణానికి ప్రజలను, పలు సంఘాలను ఐక్యం చేసి ఉద్యమిస్తామని సిపిఎం నాయకులు గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు, ముట్నూరు వెంకటరమణ, హనుమంతు రాము హెచ్చరించారు.

కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారం

పేరుకే కాలువ... చుక్కనీరు రాదు

ప్రతి ఏటా ఉపాధి పనులు

అన్నదాతకు తప్పని సాగునీటి కష్టాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరులో అన్నదాతలకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. పేరుకే కాలువ తప్ప చుక్కనీరు అందడంలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ద్వారా ఒకటో బ్రాంచి పరిధిలోనే కాలువ ద్వారా నడుకూరు గ్రామ పంట పొలాలకు సాగునీరు రావల్సి ఉంది. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందంగా కాలువ పేరు చెప్పి ప్రతి ఏటా ఉపాధి హామీ పనులు చేయడమే తప్ప ఖరీఫ్ సీజన్లో చుక్క నీరు కూడా రావడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తాము మోటర్ల ద్వారా ఆధారపడి పంటలను సాగు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఈ కాలువ ఆనవాళ్లు లేకుండా పోయిందని, కాలువలో చెత్తాచెదారం పూడుకుపోవడంతో దోమలకు ఆవాసంగా మారిందన్నారు. దోమ స్వైర విహారంతో రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువను అభివృద్ధిపర్చి సాగునీరు వచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి ; 9మందికి గాయాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తూడి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం ఎరకయ్యపేటకు చెందిన అల్లు బోయిన మల్లేష్(40)మృతి చెందగా, మరో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

కోటబొమ్మాళి మండలం ఎరకయ్యపేటలో ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు స్వగ్రామం నుంచి ఆదివారం రాయగడలోని మజ్జి గౌరమ్మ దర్శనానికి టాటా మ్యాజిక్‌పై రాయగడ వచ్చారు. పూజ అయిన అనంతరం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా వీరఘట్టం మండలం తూడి గ్రామ వద్దకు వచ్చేసరికి వాహనాన్ని అదుపు చేయలేకపోవడంతో పక్కనున్న చెట్టుకు ఢీకొంది. ఈ సంఘటనలో వాహనంలో ఉన్న మల్లేష్ రోడ్డుపైకి ఎగిరి పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. మల్లేష్‌తో పాటు మరో 9 మంది గాయపడ్డారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రి తరలించార.ు మల్లేష్ అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన 9 మందిని మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ కి తరలించినట్లు ఎస్సై ఎం.హరికృష్ణ తెలిపారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రి తాగుతున్నాడని కుమార్తె ఆత్మహత్య

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని జికెఆర్‌పురం గ్రామానికి చెందిన ముద్దాడ శ్రవంతి(15) తన తండ్రి మద్యానికి బానిసవడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. గతంలో తన తండ్రి, తల్లీకి గొడవకాడంతో తల్లి కుమారుడుని తీసుకుని కన్నవారింటికి వెళ్లిపోగా శ్రవంతి మాత్రం తండ్రి వద్దనే ఉండిపోయింది. అయినప్పటికీ తండ్రిలో ఎటువంటి మార్పు రాకపోవడంతో ఈ నెల 18వ తేదీన తన ఇంట్లో చీమల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వెంటనే ఆమెను బాడంగి పిహెచ్‌సికి అక్కడి నుంచి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె ఆదివారం మృతి చెందింది. తల్లి ముద్దాడ పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఉమా మహేశ్వరరావు కేసు నమోదు చేశారు.

నేరాలు ఘోరాలు

ప్రాణం తీసిన పొగమంచు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

దట్టంగా కురిసిన పొగమంచు ఒక ప్రాణం తీసింది. మండలంలోని పేరాపురానికి చెందిన సీలవరపు సూరిబాబు (25) ఆదివారం ఉదయం హెచ్‌బిఎల్ పరిశ్రమలో పనిచేసేందుకు తన ద్విచక్ర వాహనంపై పేరాపురం నుండి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో వెలుతుండగా ముందు వెళుతున్న నాటు బండిని ఢీకొని మృతి చెందాడు. పొగమంచు కారణంగా ముందున్న నాటు బండి కనబడకపోవడంతో వెనుక నుండి వెల్లి బలంగా డీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పూసపాటిరేగ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాటుబంటి కావడంతో లైట్లు లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని చెబుతున్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మద్దివలస గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తవలస గ్రామానికి చెందిన గర్భాపు అప్పయ్యకు తీవ్రంగా, కొన్న ఆదినారాయణకు స్వల్పంగా గాయాలయ్యాయి. గర్భాపు అప్పయ్య ఎం. సీతారమపురం నుండి రైస్ బ్యాగ్ పట్టుకొని ఇంటికి వస్తున్న తరుణంలో మద్దివలస గ్రామ శివారులో ఆదినారాయణ అనే వ్యక్తి వెనుక నుండి బైక్‌పై వచ్చి బలంగా ఢీ కొట్టడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షత గాత్రులను 108 సిబ్బంది ఇద్దరినీ రాజాంలో ఓ ఆసుపత్రికి తరలించారు.

భారీగా మద్యం సీజ్

ప్రజాశక్తి - బొబ్బిలి

బెల్ట్ షాపునకు తరలిస్తున్న మద్యాన్ని ఎస్ఐ జ్ఞానప్రసాద్, పోలీస్ సిబ్బంది సీజ్ చేశారు. శనివారం రాత్రి 10గంటల సమయంలో ఆటోలో అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఐటిఐ కాలనీ సమీపంలో దాడి చేసి ఆటోను తనిఖీ చేశారు. ఆటోలో 552 మద్యం సీసాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న మెట్టవలసకు చెందిన కెల్ల రాము, పువ్వల పైడిరాజును అరెస్టు చేశారు. బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు హెచ్చరించారు.

రాజ్ మహాల్ కాలనీలో దొంగల బీభత్సం

బొబ్బిలి : బొబ్బిలి రాజ్ మహల్ కాలనీలో శనివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని చోరీకి విఫలయత్నం చేశారు. కాలనీలో నివాసముంటున్న మరడాన మురళీకృష్ణ ఇంటిలో చోరీకి పాల్పడగా, మరో రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీకి ప్రయత్నం చేశారు. నారాయణప్పవలస ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న మురళీకృష్ణ శనివారం విశాఖలో చదువుతున్న కుమారుడు వద్దకు ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. శనివారం అర్ధరాత్రి సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న రెండున్నర కిలోల వెండి వస్తువులు, నాలుగున్నర తులాల బంగారు వస్తువులు, రూ.1.50లక్షల నగదును చోరీకి గురి చేసినట్లు బాధితుడు చెబుతున్నాడు. ఒక ఇంటిలో చోరీ చేసి మరో రెండు ఇళ్ల తాళాలు పగలగోట్టేందుకు ప్రయత్నించడంతో స్థానికులు ద్వారా తెలుసుకున్న ఆర్డిఒ పి.శేషశైలజ పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో చోరీ జరిగిన ఇంటిని హెచ్‌సి శ్రీనివాసరావు, రమణ పరిశీలించి క్లూస్ టీమ్‌కు సమాచారం ఇచ్చారు. సమగ్ర దర్యాప్తు చేస్తామని పట్టణ సిఐ నాగేశ్వరరావు చెప్పారు.